ఈనాడు
తిరుపతి
శనివారం అక్టోబరు 5, 2024 III



మొక్కు తీర్చుకోవాలన్న భక్తితత్పరత ఒకరిది.. మెట్టు మెట్టుకూ మోకరిల్లేది మరికొందరు.. ఉరుకుల పరుగుల జీవనంలో కాస్త ప్రత్యేకత కోరుకుంటూ కదిలివచ్చే కుటుంబాలు ఇంకొన్ని.. శేషాచల అందాలు ఆస్వాదిస్తూ సెల్ఫీలతో బందిస్తూ ముందుకు సాగే యాత్రికులు మరో వైపు.. చిన్నారులు, యువత మొదలు మహిళలు, వృద్ధులతో శ్రీవారి మెట్ల మార్గాల్లో నిత్యం గోవింద నామస్మరణలు వినిపిస్తుంటాయి. బ్రహ్మోత్సవ వేళ ఈ సందడి మరింత అధికంగా ఉండగా మదిలో ఓ విషయం గుర్తుంచుకోవాల్సి ఉంది.
- న్యూస్‌టుడే, తిరుమల

మెట్లదారిలో.. హృదయ నివేదన విందాం

అలవాటు లేకుంటే సాహసాలొద్దు





శ్రీవారి దర్శనార్థం భక్తులు వివిధ మార్గాల్లో తిరుమలకు చేరుకుంటారు. వాహనాల్లో వచ్చేవారికి మొదటి, రెండో ఘాట్ రోడ్లు అందుబాటులో ఉన్నాయి. నడకమార్గంలో అయితే తిరుపతి నుంచి అలిపిరి మీదుగా తిరుమలకు చేరుకోవచ్చు. ప్రస్తుతం శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులు పెద్దసంఖ్యలో ఈ మార్గం గుండానే చేరుకుంటుండటంతో తితిదే ఈ మార్గాన్ని అభివృద్ధి చేసింది. 3,650 మెట్ల దారిలో ఎక్కడికక్కడ తాగునీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు చేశారు. చంద్రగిరి వైపున ఉన్న శ్రీవారి మెట్టు మార్గం మరొకటి. ఇక్కడ 2,100 మెట్లు ఉండగా అలవాటున్నవారు గంటలోపే తిరుమలకు చేరుకోవచ్చు. ప్రతిరోజూ అలిపిరి మార్గంలో 10 నుంచి 15వేల మంది, శ్రీవారిమెట్టు మార్గంలో ఏడు నుంచి పదివేలమంది కొండపైకి చేరుకుంటున్నారు.

శారీరక సామర్థ్యం కీలకం

మెట్ల మార్గాల్లో ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేనివారికి, రోజువారీ వ్యాయామం చేసేవారికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. కొవిడ్ తరవాత గుండె సంబంధిత సమస్యలు అన్ని వయసుల వారికి వస్తున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఈ మార్గంలో ప్రతి నెలా ఇద్దరుముగ్గురు అనారోగ్యం బారిన పడటం, అందులో ఒకరు మృతిచెందడం వంటివి చోటుచేసుకుంటున్నాయి.

భక్తులకు కార్డియాక్ పరీక్షలు

నడకదారిలో బాధితులకు అత్యవసర వైద్యం అందించడంపై తితిదే ఉన్నతాధికారులు దృష్టిసారించారు. స్విమ్స్ ఆధ్వర్యంలో తితిదే విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై ఇప్పటికే పలు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. అలిపిరి, శ్రీవారి మెట్టుమార్గాల వద్ద స్విమ్స్ వైద్యులతో కార్డియాక్ స్క్రీనింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

విశ్రాంతి తీసుకోవడం, బృందాలుగా వెళ్లడం మేలు



గుండె సర్జరీలు, ఇటీవల స్టంట్లు అమర్చుకున్నవారు, రక్తపోటు నియంత్రణలో లేనివారు, జ్వర పీడితులు, శ్వాసకోశ సంబంధిత జబ్బులతో బాధపడేవారు దూరంగా ఉండాలి. మిగిలినవారూ జాగ్రత్తలు పాటించాలి. ముందస్తుగా ఈసీజీ, టీఎంటీ వంటి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. అలసటకు గురైన సమయంలో సేద తీరాలి. గ్లూకోజ్ నీరు తాగుతూ హైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి. భక్తులు బృందాలుగా మాట్లాడుకుంటూ వెళ్లడంతో కొంత అలసట తగ్గే అవకాశం ఉంటుంది.
– డా.పీవీ హరీష్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రుయా

గంగమ్మ ఆలయ ఈవోగా జయకుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న జయకుమార్

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా జయకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో ఇక్కడే సీనియర్ అసిస్టెంట్ హోదాలో పని చేశారు. 2017 నుంచి 2019 వరకు రెడ్డమ్మ కొండ దేవస్థానం.. అనంతరం తలకోనలోని శ్రీ సిద్ధేశ్వర ఆలయ ఈవోగా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. త్వరలో ఆలయ పాలక మండలిని నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేసినట్లు సమాచారం.

బీఐవో ప్రత్యేక అధికారి జయచంద్రారెడ్డి తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

ఈనాడు-తిరుపతి: స్విమ్స్‌లోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీకి ప్రత్యేక అధికారిగా నియమించిన డా. ఎం.జయచంద్రారెడ్డిని తొలగిస్తూ స్విమ్స్ డైరెక్టర్, ఎస్వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వీసీ ఆర్.వి.రవికుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమించి అర్హత లేకున్నా నాటి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి బంధువు జయచంద్రారెడ్డిని బీఐవోకి ప్రత్యేక అధికారిగా నియమించారు. దీనిపై 'కొలువు సృష్టించి.. కట్టబెట్టి' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. కన్సాలిడేటెడ్ చెల్లింపుల విధానం ద్వారా 2022లో ఆయన్ను నియమించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మాత్రమే అతను పనిచేసేలా నాటి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని జయంద్రారెడ్డిని బీఐవో ప్రత్యేక అధికారి పదవి నుంచి తొలగించారు. బాధ్యతలను తక్షణమే సర్జికల్ ఆంకాలజీ హెచ్‌వోడీ నరేంద్రకు అప్పగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, సెక్షన్ల నుంచి నో డ్యూ సర్టిఫికెట్‌ను సమర్పించాలని స్పష్టం చేశారు.

7లోపు ధ్రువపత్రాల పరిశీలన

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఏపీ ఉన్నత విద్యా మండలి-2024 వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీసెట్-2024లో ర్యాంకులు పొంది ఎస్వీయూలో ఫేస్-2లో సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 7వ తేదీ లోపు అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరుకావాలని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు సర్టిఫికెట్లను పరిశీలించిన రోజునే రుసుం చెల్లించాలన్నారు.

అప్పగిస్తే.. చర్యలు వద్దంటూ..!

- రెవెన్యూ అధికారుల తీరిలా
- చెలరేగుతున్న ఇసుక మాఫియా
- ఇబ్బందుల్లో వీఆర్వో, వీఆర్‌ఏలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఎక్కడైనా అనధికారికంగా ఇసుక, మట్టి, గ్రావెల్ వాహనాలు వెళ్తుంటే... క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, వీఆర్‌ఏలు దాడి చేసి స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేస్తున్నారు. అనంతరం రెవెన్యూ శాఖలోని అధికారులు కేసును నీరు గార్చేలా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో డివిజన్‌లో మాఫియా చెలరేగిపోతోంది. చివరకు వీఆర్వోలు, వీఆర్‌ఏలు బలైపోతున్నారు.

■ సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లో ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియా ఆగడాలు నిరంతరాయంగా సాగుతున్నాయి. దీని కట్టడికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా.. మండల స్థాయి రెవెన్యూ యంత్రాంగం తప్పిదంతో అది కాస్తా పక్కదారి పడుతోంది. ఇందుకు తాజాగా డివిజన్‌లో జరిగిన ఘటనలే ఉదాహరణ.. సూళ్లూరుపేట, పెళ్లకూరు, ఓజిలి, తడ, నాయుడుపేట, దొరవారిసత్రం, సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియా పెచ్చుమీరింది. వీరు దొంగచాటుగా రేయింబవళ్లు పనికానిస్తున్నారు. మాఫియాకు ప్రజాప్రతినిధులు, తహసీల్దార్ల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయి. వాహనాలను వీఆర్వోలు పట్టుకున్న వెంటనే నేతలు వారిపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఇందులో కొందరు నిక్కచ్చిగా విధులు నిర్వహిస్తూ.. వాహనాలను పోలీసు ఠాణా వరకు తీసుకెళ్లి అప్పగిస్తే.. వెంటనే మండల స్థాయి అధికారులకు అధికార పార్టీ నేతలు ఫోన్ చేసి, వాటిని వదిలి పెట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు డివిజన్‌లో కోకొల్లలుగా ఉన్నాయి. దీంతో మాఫియా నాయకులు తప్పించుకుంటున్నారు.



తాజా ఘటనలు చూస్తే..

సూళ్లూరుపేట మండలంలోని ఇలుపూరు నుంచి గతనెల 27న ఇసుక ట్రాక్టర్ వస్తుండగా వీఆర్వో శ్రీదేవి పట్టుకున్నారు. పోలీసు ఠాణాకు తీసుకొస్తుండగా మార్గ మధ్యలో మండల తెదేపా అధ్యక్షుడు అడ్డుకున్నారు. అనంతరం మీడియా వెళ్లడంతో ట్రాక్టర్ పోలీసు ఠాణాకు చేరింది. దీనిపై వీఆర్వో ఫిర్యాదు చేశారు. నేతలు రంగంలోకి దిగి తహసీల్దార్‌పై ఒత్తిడి చేశారు. ఇక తహసీల్దారే స్వయంగా ఎస్సైకి ఫోన్ చేసి, ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించారు. ట్రాక్టర్‌కు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా వదిలిపెట్టగా వీఆర్వో ఫిర్యాదు బుట్టదాఖలు అయింది.

■ పెళ్లకూరు మండలంలోని చెంబడిపాళెంలోని సీజేఎఫ్ఎస్ భూముల నుంచి మట్టి తవ్వకాలు జరుపుతుండగా వీఆర్వో, ఆర్ఐ పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా అధికారపార్టీకి చెందిన ముఖ్యనేత ఫోన్ చేసి వదిలిపెట్టాలని హుకుం జారీ చేశారు. దాంతో తహసీల్దార్ వాటిని వదిలిపెట్టారు. నేటికీ అక్కడ మట్టి తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. అలాగే కప్పగుంట, కల్వకూరు సమీపాన ఇసుక ట్రాక్టర్లను వీఆర్వో దాడి చేసి స్వాధీనం చేసుకుంటే.. అధికారపార్టీ నేతలు దుర్భాషలాడారు.

■ తడ మండలంలోని కాసింఖాన్‌కండ్రిగ, మాంబటు చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుపుతున్నాయని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే అసలు అక్కడకు వెళ్లలేనే లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

■ ఎన్నికల సమయంలో కోళ్లమిట్ట వీఆర్వో దివ్య ఓ మట్టి ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో ఆమెకు వైకాపా నేతల నుంచి ఎన్ని బెదిరింపులు వచ్చినా లెక్కచేయక కేసు పెట్టారు. అయితే ఠాణాలో అప్పటి ఎస్సై ఫిర్యాదులోని సారాంశాన్ని పరిగణనలోకి తీసుకోక ఇష్టానుసారంగా కేసు నమోదు చేశారు. దీనిపై అప్పటి తహసీల్దార్ గోపాలకృష్ణ ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు కూడా ఫిర్యాదు చేసిన దాఖలాలు ఉన్నాయి.

తితిదేకి బీమా పరిహారం చెల్లించాలని ఫోరం ఆదేశం

తిరుపతి (లీగల్): తితిదేకి బీమా పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల ఫోరం బెంచ్ గత నెల 30న ఉత్తర్వులు జారీ చేసినట్లు తితిదే తరపు న్యాయవాది కె.రాజేష్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. తితిదేకి సంబంధించిన ఆలయాల్లోని బంగారు ఆభరణాలకు యునైటెడ్ ఇండియా బీమా సంస్థ ద్వారా బీమా చేయించారు. 2009లో తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలోని నగలు చోరీ అయ్యాయి. దీనిపై తిరుపతి పడమర పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొన్ని నగలు రికవరీ చేయగా.. రూ. 2,43,480 విలువైన నగలను పోలీసులు రికవరీ చేయలేకపోయారు. పాలసీ ప్రకారం సొమ్ము చెల్లించాల్సిందిగా తితిదే బీమా సంస్థని కోరింది. సంస్థ నిరాకరించటంతో ఫోరంలో ఫిర్యాదు దాఖలు చేశారు. సేవా లోపానికి పాల్పడిన బీమా సంస్థ తితిదేకి బీమా పరిహార సొమ్ము రూ. 2,43,480, సేవా లోపం కింద రూ.లక్ష, రూ.10వేలు ఫిర్యాదు దాఖలు ఖర్చు 45రోజుల్లో చెల్లించాల్సిందిగా ఆదేశించింది.



నాడు-నేడు ఫొటో ప్రదర్శనను తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరికి వివరిస్తున్న తితిదే సీపీఆర్వో టి.రవి, సీనియర్ ఫొటోగ్రాఫర్ శేఖర్




తితిదే నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి ఆనం తదితరులు











పుష్ప ప్రదర్శనశాల ప్రారంభం

తిరుమల, న్యూస్‌టుడే: స్థానిక కల్యాణవేదిక వద్ద ఏర్పాటుచేసిన పుష్ప ప్రదర్శనను తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరిలు శుక్రవారం ప్రారంభించారు. ప్రదర్శన ప్రవేశ మార్గంలో ఉంచిన దుర్యోధన పరాభవం, అటవీశాఖ ఏర్పాటుచేసిన శేషాచల శ్రేణుల సెట్టింగ్, తితిదే ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ శిల్పకళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన చెక్క, సిమెంట్, రాయి, లోహ శిల్పాలను పరిశీలించారు. తితిదే ప్రజాసంబంధాలశాఖ ఆధ్వర్యంలో నాడు-నేడు కాన్సెప్ట్‌తో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ని, తిరుమల దేవాలయం, ఇతర ముఖ్యమైన అంశాలకు సంబంధించిన అరుదైన నాటి ఫొటోలను ఇందులో ప్రదర్శించారు. వివిధ శాఖల వారీగా ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించి అభినందించారు. సీవీఎస్‌వో శ్రీధర్, ఉద్యానవనశాఖ డీడీ శ్రీనివాసులు, తితిదే డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఎస్వీ ప్రిన్సిపల్ వెంకట్రమణారెడ్డి, సీపీఆర్వో టి.రవి తదితరులు పాల్గొన్నారు.





బాధ్యతలు చేపడుతున్న రవినాయుడు, చిత్రంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ ఎండీ గిరీశ తదితరులు

శాప్ ఛైర్మన్‌గా రవినాయుడు బాధ్యతల స్వీకరణ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్‌గా అనిమిని రవినాయుడు బాధ్యతల స్వీకరణ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్థానిక ఐజీఎంసీ స్టేడియం వద్ద గల శాప్ కార్యాలయానికి ఆయన ఊరేగింపుగా తరలివచ్చారు. రవినాయుడు దంపతులను వేదపండితులు పూర్ణకుంభంతో కార్యాలయంలోకి స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి సమక్షంలో శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీశ పుష్పగుచ్ఛాన్ని అందించి బాధ్యతల స్వీకరణ దస్త్రంలో సంతకం చేయించారు. రవినాయుడు మాట్లాడుతూ.. ప్రతి సోమవారం శాప్ కార్యాలయంతో పాటు డీఎస్‌ఏల్లో కూడా క్రీడాకారులు, వారి తల్లిదండ్రుల నుంచి వినతులు స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ వైభవాన్ని వ్యాప్తి చేయండి



మాట్లాడుతున్న తితిదే ఈవో జె.శ్యామలరావు, చిత్రంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, సీవీఎస్‌వో శ్రీధర్, సీపీఆర్వో టి.రవి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాల వైభవాన్ని విశ్వవ్యాప్తంగా తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులకు తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రాంభగీచా-2లోని మొదటి అంతస్తులో మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈవో మాట్లాడుతూ.. శ్రీవేంకటేశ్వర స్వామి వైభవాన్ని, యాత్రికులకు తితిదే అందిస్తున్న సౌకర్యాలను బయటి ప్రపంచానికి విస్తృతంగా తీసుకెళ్లడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. సీపీఆర్వో డా.టి.రవి, పీఆర్వో పి.నీలిమ పాల్గొన్నారు.

భూమనకే సనాతన ధర్మంపై మాట్లాడే అర్హత లేదు

ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవారి నిధులు దుర్వినియోగపరిచి, ప్రసాదాల్లో నాసిరకం సరకులు ఉపయోగించడమే కాకుండా కల్తీ నెయ్యికి కారకులు కరుణాకర్ రెడ్డేనని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కరుణాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. భూమన తన చరిత్ర మరిచి మాట్లాడుతున్నారని, 40 ఏళ్ల కిందటే తిరుపతిలో రౌడీయిజానికి పునాది వేసింది ఆయన కుటుంబమేనని ఆరోపించారు. శ్రీవారిని నల్లరాయి అన్న కరుణాకర్ రెడ్డికి సనాతన ధర్మం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. జనసేన ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ కరుణాకర్ రెడ్డి చరిత్రంతా అవినీతిమయమేనని, జగన్‌ను అధఃపాతాళానికి తొక్కేస్తానని పవన్ కల్యాణ్ చెప్పిన ప్రకారం చేశారని, ఆయన చంకలో చంటిబిడ్డ కాదని, వైకాపా నేతల పాలిట చురకత్తిలాంటి వారని భూమన విమర్శలను తిప్పికొట్టారు.

పవన్ కల్యాణ్ మాట్లాడిన ప్రతి మాటా అక్షర సత్యం

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: పవన్‌కల్యాణ్ వారాహి సభలో మాట్లాడిన ప్రతి మాట అక్షర సత్యమని, పవన్ మాటలకు వైకాపా కూసాలు కదులుతున్నాయని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. వైకాపా పాలనలో తిరుమలలో శ్రీవారికి అపచారం జరిగిందని ఆరోపించారు. లడ్డూ కల్తీ విషయంలో వాస్తవాలు వెలికి తీయాలన్న సంకల్పంతో సుప్రీం ధర్మాసనం ఐదు మంది సభ్యులతో కూడిన కమిటీని భాజపా స్వాగతిస్తోందన్నారు. సమావేశంలో వరప్రసాద్, అజయ్‌కుమార్, డా.శ్రీహరి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతన్నల గజగజ

❖ పంటలపై ఏనుగుల దాడులు ❖ ఉమ్మడి జిల్లాలోని అన్నదాతలకు ఇబ్బందులు



నాలుగు రోజుల కిందట పుల్లావాండ్లపల్లిలో ఏనుగులు తొక్కేసిన వరి

పాకాల, న్యూస్‌టుడే: చేతికొచ్చిన పంటలపై గజరాజులు వరుస దాడులు చేస్తూ అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రధానంగా కౌండిన్య అభయారణ్యం, శేషాచలం నుంచి వస్తున్న ఏనుగులు వారానికోసారి వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పంటలను అటవీశాఖ అధికారులు పరిశీలించి మొక్కుబడిగా నష్టపరిహారం అందిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల దాడులతో పొలాలను బీడు భూములుగా వదిలేయాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు.

జరిగిన ఘటనలివీ..

❖ గత ఫిబ్రవరి, మార్చిలో 17 ఏనుగులు తిరుపతి జిల్లా పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, చిత్తూరు జిల్లాలోని పులిచెర్ల, సదుం, సోమల, ఐరాల మండలాల్లో స్వైరవిహారం చేసి వందలాది ఎకరాల్లో పంటను నాశనం చేశాయి. ❖ జనవరిలో పులిచెర్ల మండలంలో ఓ రైతును, నాలుగు నెలల కిందట పాకాల మండలం, చెన్నుగారిపల్లి సమీపంలో ఓ వ్యక్తిని తొక్కి చంపేశాయి. ❖ వారం రోజుల్లో రెండు సార్లు నడింపల్లి, కొండకిందపల్లి, పుల్లావాండ్లపల్లి పరిసరాల్లో వరి పొలాలను తొక్కి ధ్వంసం చేశాయి. ❖ ఈ ఏడాది ఆరంభంలో చంద్రగిరి మండలంలో నెల రోజుల పాటు తిష్ఠవేసిన ఏనుగులు పంటలను నాశనం చేశాయి. ❖ పాకాల మండలంలో పలు దఫాలుగా గజరాజుల దాడులు కొనసాగుతున్నాయి.

మొక్కుబడిగా పరిహారం

గతేడాది మార్చిలో పదిపుట్లబైలు ప్రాంతంలో ఏనుగు దాడిలో నష్టపోయిన రైతులకు అటవీ అధికారులు పరిహారం మొక్కుబడిగా అందించారు. మిగతా బాధితులు దరఖాస్తు చేసుకున్నా వారికి మాత్రం ఇప్పటి వరకు పైసా రాలేదు. చిన్నగొట్టిగల్లు మండలంలో నష్టాలపాలైన రైతులు ఇప్పటికీ పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇప్పటివరకు దరఖాస్తుల మేర 100 మందికి పైగా రైతులకు రూ.10లక్షల పరిహారం అందించాం. మరో వారంలో 48 మందికి పరిహారం అందించబోతున్నాం. దాడులకు సంబంధించి దరఖాస్తులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపుతున్నాం. ఏనుగుల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. **- భారతి, ఫారెస్ట్ సెక్షన్ అధికారిణి, పాకాల**

చేతికొచ్చిన పంటను నాశనం చేశాయి



నాలుగు రోజుల కిందట పొలాలపై పడిన ఏనుగులు రెండు ఎకరాల్లో వరి పొలాన్ని తొక్కేశాయి. రూ.50 వేలు అప్పు చేసి పెట్టుబడి పెట్టా. ఈ విషయాన్ని అటవీ అధికారులకు చెప్పినా స్పందన కరవైంది. పొలం వద్దకు కాపలా వెళ్లాలన్నా భయంగా ఉంది. ఏనుగుల దాడులతో పొలాలను బీడుగా వదిలేయాల్సిన దుస్థితి దాపురించింది.
- నరసింహులు, రైతు, పుల్లావాండ్లపల్లి

ఏనుగుల బెడద నివారించాలి



ఏనుగుల దాడుల కారణంగా పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. గత రెండేళ్లలో మూడు సార్లు పంటను నష్టపోయా. స్థానిక అధికారులు, నాయకులు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. నష్టానికి సరిపడా పరిహారాన్ని రైతులకు అందించాలి.
- జయచంద్ర, రైతు, కొండకిందపల్లి

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: కనుమ దారిలో, ప్రమాదకర మలుపుల్లో డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు అప్రమత్తతతో ప్రమాదాలు నివారించవచ్చని సామాజిక కార్యకర్త, న్యాయవాది, ప్రమాదాల విశ్లేషక నిపుణులు ఎం.బాలాజీ పేర్కొన్నారు. తిరుపతిలోని జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన 90 మంది బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. పలు అంశాలపై డ్రైవర్లకు శిక్షణ కల్పించారు. డ్రైవింగ్‌లో పరిమిత వేగాన్ని అనుసరించాలని, తద్వారా ప్రయాణికులను సురక్షితంగా వారివారి గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్ రెడ్డి, వివిధ డిపోల మేనేజర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయవాది ఎం.బాలాజీ

డీఎఫ్వో చైతన్యకుమార్‌రెడ్డి బదిలీ

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: జిల్లా అటవీశాఖాధికారి(డి.ఎఫ్.ఓ) చైతన్యకుమార్‌రెడ్డిని బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను.. ఆ శాఖ రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. ఆయనపై ఆరోపణల నేపథ్యంలో ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన స్థానంలో కాకినాడ డీఎఫ్వో భరణిని ఇక్కడ నియమించింది.

క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మహిళా వర్సిటీ(తిరుపతి): నూతన క్రిమినల్ చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని సీఐ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో పోలీస్ శిక్షణా కళాశాల తిరుపతి సిబ్బంది న్యాయ విద్యార్థినులకు నూతన క్రిమినల్ చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సైబర్ నేరాలు, రక్షణా చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు సురేష్, అశ్విన్, దివ్య, న్యాయ విభాగం ఆచార్యులు సీతాకుమారి, ఇందిర పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సంపత్ (పాత చిత్రం)

సత్యవేడు, న్యూస్‌టుడే: తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి సంపత్(36) అనే యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కోమటిగుంటలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సంపత్ ఇంటి ముందు ఉన్న విద్యుత్ తీగలు తెగి ఇంటి ఆవరణలోని కంపపై పడడంతో విద్యుత్ స్తంభం వద్ద మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో దీపాలు, వీధి దీపాలు వెలగకపోవడంతో సంపత్ బయటకు రావడంతో కంపపై ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామస్థులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా సంపత్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు, కుటుంబ సభ్యులు శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పోలీసులు బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కూలీతో ఇద్దరు పిల్లలు తాము ఎలా బతకాలని భార్య కన్నీటిపర్యంతమైంది.

ఈనాడు
తిరుపతి
శనివారం అక్టోబరు 5, 2024


పట్టువస్త్రాలు తెస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు


ధ్వజారోహణ కార్యక్రమంలో హారతి ఇస్తున్న అర్చకులు


పెద్ద శేషవాహనంపై దేవేరులతో శ్రీవారు

ధ్వజగోవిందం.. శేషారవిందం

వేడుకగా ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల, న్యూస్‌టుడే: ఇల వైకుంఠం పులకించింది.. భక్త సంద్రంలో ఓలలాడింది. గోవింద నామస్మరణలు మిన్నంటిన వేళ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6 గంటల మధ్య మీనలగ్నం శుభముహూర్తంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా గరుడ పటాన్ని ఊరేగించి బ్రహ్మాది దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి సమక్షంలో ఎగురవేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు పట్టువస్త్రాలను మూలమూర్తికి సమర్పించారు. పెద్దశేష వాహనసేవలో పాల్గొన్నారు. స్వామివారు తొలి వాహనమైన ఏడు పడగల ఆదిశేషునిపై ఉభయ దేవేరులతో పరమపద వైకుంఠనాథుని అలంకారంలో తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయ ప్రదానం చేశారు.




వాహన సేవను తిలకిస్తున్న జీయంగార్లు

నేడు చిన్నశేష, హంస వాహన సేవలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం చిన్నశేష, హంస వాహన సేవలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహన సేవ, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపన తిరుమంజనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహనసేవ జరగనుంది.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తితిదే ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 14 కళా బృందాల్లో 410 మంది పాల్గొన్నారు. కళాకారులు తమ అద్భుత ప్రదర్శనలతో భక్తులకు నయనానందాన్ని కలిగించారు.







నేటి సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

తిరుమల: ముఖ్యమంత్రి ఎన్‌.చంద్రబాబునాయుడు శనివారం ఉదయం పాంచజన్యం వద్ద నూతనంగా ప్రారంభించనున్న వకుళమాత వంటశాల, శ్రీపద్మావతి అతిథిగృహాన్ని తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పరిశీలించారు. వంటశాల ప్రాంగణంలో ఏర్పాట్లను, ఆధునిక వంటసామగ్రి పనితీరును సీఈ సత్యనారాయణ, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి జీఎల్‌ఎన్ శాస్త్రి వారికి వివరించారు. ముందుగా సీఎం బసచేయనున్న పద్మావతి అతిథిగృహాన్ని పరిశీలించారు.

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్‌ఎస్‌డీ టోకెన్లు లేకుండా శుక్రవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. గురువారం శ్రీవారిని 63,376 మంది దర్శించుకోగా రూ.3.56 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

వైష్ణవీరూపం.. జ్ఞానప్రసన్నం



దేవీ నవరాత్రి వార్షిక ఉత్సవాల్లో భాగంగా శ్రీజ్ఞానప్రసూనాంబిక అమ్మవారు శంఖు, చక్ర, గదాయుధాలను ధరించి వైష్ణవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అసుర సంహారానికి ఆదిశక్తి సోదరుడైన మహావిష్ణువు ప్రసన్నం కోరుతూ శుక్రవారం ఈ విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని అలంకార మండపం నుంచి ఉత్సవమూర్తిని అంజిఅంజి వినాయకుడు, బాలజ్ఞానాంబిక ఆలయాల వద్దకు తీసుకువచ్చి ధూప, దీప, నివేదనలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

స్కిట్‌కు పూర్వ వైభవం

- వైకాపా పాపానికి పరిష్కారం
- వచ్చే ఏడాది నుంచి తరగతులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వైకాపా పాపాలకు ప్రక్షాళనగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తూ ముందుకెళ్తోంది. పేద విద్యార్థులకు ఇంజినీరింగ్ చదువును అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో ఏర్పాటైన స్కిట్ ఇంజినీరింగ్ కళాశాలకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని, వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం నియమించిన కమిటీ స్పష్టం చేసింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న స్కిట్ కళాశాలను కమిటీ సభ్యులు శుక్రవారం సందర్శించి హామీని ఇవ్వడం విశేషం.



స్కిట్ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వం నియమించిన కమిటీతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రయాసలతో.. ప్రాభవం

స్కిట్ ఏర్పాటు వెనుక అప్పటి మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, అధికారుల ప్రయాస ఎంతో ఉంది. 1997 ఫిబ్రవరిలో కళాశాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖకు అనుబంధంగా ఉన్న ఏకైక కళాశాలగా, దేవుడి కళాశాలగా ఎంతో ప్రాభవాన్ని పొందింది. రాజకీయ జోక్యంతో గాడితప్పిన స్కిట్‌ను జేఎన్‌టీయూకు విలీనం చేయాలని 2018లో గోపాలకృష్ణారెడ్డి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు తెప్పించారు. అధికారంలోకి వచ్చిన వైకాపా ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించింది. ఓ వైపు కళాశాలకు మహర్దశ తీసుకువస్తామని చెప్తూనే పూర్తిగా మూసివేసింది.

కమిటీ చెప్పిందేమంటే..

జేఎన్‌టీయూలో స్కిట్‌ను విలీనం చేయాలన్న ప్రతిపాదనపై ప్రభుత్వం నియమించిన కమిటీ ఇక్కడి పరిస్థితులన్నింటినీ అధ్యయనం చేసినట్లు రాష్ట్ర ఉన్నత విద్య కమిటీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ రామ్మోహన్‌రావు తెలిపారు. స్కిట్ కళాశాలలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నేతృత్వంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జేఎన్‌టీయూ వాళ్ళు చెప్పిన అంశాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే ఏడాది తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టదలిచినట్లు వివరించారు. గతంలో ఉన్న అన్ని కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ ఇప్పటికే తమ యూనివర్సిటీకి అనుబంధంగా అనంతపురం, కడప, అన్నమయ్య జిల్లాల్లో కళాశాలలు ఉన్నాయన్నారు. తిరుపతి జిల్లాలో స్కిట్ జేఎన్‌టీయూ కళాశాలగా మళ్లీ అదే వైభవాన్ని చాటుకుంటుందని స్పష్టం చేశారు.

ఆశలకు బీజం.. ఎన్నికల సమయంలో స్కిట్‌కు పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చింది. పరిపాలన ప్రారంభించిన వంద రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లు స్కిట్‌ను జేఎన్‌టీయూలో విలీనం చేసేందుకు సాధ్యాసాధ్యాలపై గత నెల 14వ తేదీన ప్రత్యేక కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ కమిటీ శుక్రవారం ఇక్కడి కళాశాలను సందర్శించింది. యాభై ఎకరాల్లో రూ.2500 కోట్లు విలువ చేసే స్కిట్ భవనాలను శుక్రవారం కమిటీ సందర్శించింది.



ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల



గాయత్రిగా చెంగాళమ్మ .. సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజూ శుక్రవారం అమ్మవారు గాయత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చండీయాగం నిర్వహించారు.

7న స్పాట్ అడ్మిషన్లు.. మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ఈనెల 7న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆ విభాగం సంచాలకులు సువర్ణలతాదేవి తెలిపారు. ఎంబీఏ విభాగంలో మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి ఉదయం పది గంటల నుంచి అర్హులైన విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

21 ఎర్ర దుంగలు స్వాధీనం.. తిరుపతి(జీవకోన) : ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు నెల్లూరు జిల్లా ఆత్మకూరు అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున నిర్వహించిన దాడుల్లో 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు తమిళనాడు, తిరుపతి జిల్లాకు చెందిన స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. రెండు స్కార్పియో వాహనాలు సీజ్ చేశారు. దాడుల్లో ఆర్ఐ కె.కృపానంద, ఆర్ఎస్సై అలీబాషా బృందం పాల్గొన్నారు.

ఎంబీయూలో అట్టహాసంగా మోహన్ మంత్ర

చంద్రగిరి గ్రామీణ: స్థానిక ఎంబీయూ విశ్వవిద్యాలయంలో మోహన్ మంత్ర-2024ను ప్రో.ఛాన్స్‌లర్ మంచు విష్ణు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి తెలిపారు. మంచు విష్ణు మాట్లాడుతూ... ఎంబీయూ విద్యాసంస్థలు మోహన్ మంత్ర కార్యక్రమాన్ని 11వ సారి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీయడమే మోహన్ మంత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక తదితర అంశాలపై 30కి పైగా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మంచు విష్ణు నృత్యం చేశారు. కార్యక్రమంలో వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, ఎంబీయూ చీఫ్ గ్రోత్ వికాస్ సింగ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ఛాలెంజ్ గేమ్ ఆడుతున్న మోహన్‌బాబు

ఫోను వచ్చింది.. ఎంపీడీవో చేతికి గాయమైంది

రేణిగుంట : రేణిగుంట ఎంపీడీవో విష్ణు చిరంజీవి చేతికి గాయమైంది. కార్యాలయ వర్గాలు తెలిపిన కథనం మేరకు... ఇటీవల ఎంపీడీవో ఇక్కడ ఉండకూడదని అధికార పార్టీలో ఒక వర్గం.. అతనే ఇక్కడ ఉండాలని మరో వర్గం బల ప్రదర్శనకు దిగుతూ వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక నాయకుడు తరఫున ఎంపీడీవోకు ఫోన్ వచ్చింది. ఆ సంభాషణలో ఏమి జరిగిందో తెలియదు గాని ఎంపీడీవో బ్లాక్ మెయిల్ చేసే పద్ధతులు మార్చుకోవాలని అరుస్తూ తన టేబుల్‌ను గట్టిగా కొట్టారు. దీంతో టేబుల్‌పై ఉన్న అద్దం పగిలి చేతికి గాయమైంది. తీవ్రంగా గాయం కావడంతో వెంటనే సిబ్బంది ఆయన్ను స్థానికంగా ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు.

ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్‌పై ఫిర్యాదు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం చిల్లకూరు చెరువు వేలం వ్యవహారంలో ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, స్థానిక సర్పంచి హరిబాబురెడ్డిలు మోసం చేసినట్లు ఇదే గ్రామానికి చెందిన మద్దూరు రమణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం మేరకు.. గతేడాది నవంబర్‌లో సత్యనారాయణరెడ్డి ఇంటి వద్ద చేపల వేట కోసం వేలం నిర్వహించారు. ఇందులో ఇద్దరు పాల్గొనగా రమణయ్య రూ.8 లక్షలకు దక్కించుకున్నారు. ఇందుకు అప్పట్లోనే రూ.2 లక్షలు నగదు సత్యనారాయణరెడ్డికి అందజేశారు. దీనికి ఎలాంటి రసీదు ఇవ్వకపోగా చెరువు మరమ్మతుల పేరిట ఇబ్బంది పెట్టడం, కేసులు పెట్టి భయపెట్టారు. తెదేపా సానుభూతిపరుడన్న కారణంగా తనపై కక్ష గట్టి మళ్లీ బెదిరిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. తాజాగా చెరువులో చేపలు పట్టుకునే ప్రయత్నంలో అల్లరి మూకలను పంపి బెదిరిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు	
బ్రాయిలర్ (రైతు ధర)	117
రిటైల్	139
లేయర్	110
బ్రాయిలర్స్	202
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	229
లేయర్ మాంసం	187

ఆనందం.. అంతలోనే విషాదం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు మిత్రులతో కలిసి ఎంతో ఆనందంతో బయలుదేరారు. ఎంతో సరదాగా మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ, జోకులు వేసుకుంటూ సంతోషంగా ద్విచక్ర వాహనంపై వస్తుండటంతో వాళ్ల స్నేహాన్ని చూసి మృత్యువు కన్నెర చేసింది. ప్రమాద రూపంలో మృత్యువుతో పోరాడుతూ శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగ ఎస్సీ కాలనీకి చెందిన సాయికుమార్(19) ప్రాణాలను విడిచిపెట్టాడు. అప్పటి వరకు ఆనందాన్ని ఇచ్చిన హితుడు ఇక లేడని తెలిసి మిగిలిన మిత్రులు కన్నీరుమున్నీరయ్యారు. వివరాల్లోకి వెళ్తే పుల్లారెడ్డికండ్రిగ ఎస్సీ కాలనీకి చెందిన సాయికుమార్ కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి ఆసరగా ఉంటున్నాడు. స్నేహితులైన శివ, అరవింద్‌తో కలిసి గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై పట్టణానికి బయలుదేరాడు. జయరామారావు వీధికి చెందిన సిద్ధిక్, సంసీర్‌లు ఇద్దరూ ద్విచక్ర వాహనంపై తిరుపతి వైపు వెళ్తున్నారు. ఇద్దరి వాహనాలు మిట్టకండ్రిగ నుంచి వస్తున్న వాహనాన్ని సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో పుల్లారెడ్డికండ్రిగ ఎస్సీ కాలనీకి చెందిన సాయికుమార్ తలపై బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు వదలిపెట్టాడు. ఇతనితో పాటు బైక్ మీద ఉన్న అరవింద్, శివలకు చిన్నపాటి గాయాలయ్యాయి. స్నేహితుడు లేడన్న విషయమై వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న సిద్ధిక్, సంసిర్‌లకు చిన్నపాటి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానం పెనుభూతమై

మహిళ దారుణ హత్య



కోటమ్మ

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు) : అనుమానం పెనుభూతంగా మారడంతో మహిళను దారుణంగా హత్య చేసిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని రామలింగాపురం ఎస్టీకాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కాలనీకి చెందిన కోటమ్మ(40) భర్త కొన్ని ఏళ్ల కిందట మృతి చెందడంతో అదేకాలనీకి చెందిన చెంచయ్యతో ఆరు నెలల కిందట వివాహం చేసుకుంది. అయితే కోటమ్మ వేరే వ్యక్తితో అక్రమ సంబంధం ఉన్నట్లు చెంచయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్య వివాదం నెలకొనడంతో తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో కోటమ్మ అక్కడి కక్కడే మృతి చెందినట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణం సీఐ రవినాయక్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉండటంతో అనాథలుగా మిగిలారని కాలనీ వాసులు వాపోతున్నారు.

కళ్లముందే.. కన్నీళ్లు మిగిల్చి

తల్లడిల్లిన కుటుంబీకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యుల కళ్లముందే కడతేరిపోవడంతో ఆ కుటుంబీకులు కన్నీరుమున్నీరైన ఘటన శ్రీకాళహస్తిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కార్వేటినగరానికి చెందిన చంద్రశేఖర్ అలియాస్ రాజా(37) నగరిలో సెలూన్ నడుపుకుంటున్నాడు. ఆయన భార్య, పిల్లలు ఇక్కడి బి.పి.అగ్రహారం దర్గామిట్టలో కాపురం ఉంటున్నారు. అయితే దసరా ఉత్సవాల సందర్భంగా భార్య, పిల్లలు ఓంశక్తి మాల ధరించాలని నిర్ణయించారు. ఈ విషయమై శుక్రవారం సువర్ణముఖి నదిలోని స్నాన ఘట్టాల వద్దకు వెళ్లారు. అక్కడ స్నానం చేసేందుకు నిర్దేశిత ప్రాంతాన్ని దాటి లోనికి వెళ్లడం, ఈత వచ్చినప్పటికీ అక్కడ నుంచి బయటకు రాలేక పోవడంతో నీళ్లల్లో మునిగి చనిపోయాడు. కళ్లముందే ఈ ఘటన జరగడంతో భార్య, పిల్లలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మృతదేహానికి పంచనామా వద్దని కుటుంబీకులు విన్నవించడంతో వాళ్లకు అప్పగించామని, మృతదేహాన్ని వారి స్వస్థలమైన కార్వేటినగరానికి తీసుకెళ్లారంటూ పట్టణ సీఐ గోపి తెలిపారు.

మండల అభివృద్ధి మనందరి బాధ్యత

రామచంద్రాపురం: మండల అభివృద్ధి మనందరి బాధ్యత అని ఎంపీపీ వెంకట బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల వారీగా ప్రగతి వివరాలను వివరించారు. పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎంపీడీవో ఇందిరమ్మ, గ్రామ, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.







▸ తిరుపతి (బైరాగిపట్టెడ): శ్రీ మీనాక్షి దేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి ▸ రామచంద్రాపురం: విశేష అలంకరణలో బాలాత్రిపుర సుందరి ▸ తిరుపతి (గ్రామీణ): లక్ష్మీదేవి అలంకరణలో శక్తి చాముండేశ్వరి దేవి ▸ బాలా త్రిపురసుందరి అవతారంలో చెంచువారి కాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ ▸ చంద్రగిరి: శ్రీమూలస్థానమ్మ వాహనసేవలో ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ, ఉభయదాతలు

వాడవాడలా నవరాత్రుల వైభవం

న్యూస్‌టుడే, బృందం: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం శక్తి ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన పూజలు చేశారు.



పాకాల: నేంద్రగుంట శ్రీమూలస్థానమ్మ పూజల్లో భక్తులు

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు రజక కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి రజక కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని ఈనాడు ఆఫీసు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (5 అక్టోబర్ 2024, శనివారం), రేపు (6 అక్టోబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 91547 72006 & 80080 02165 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

'కమీషన్లకు తిరుమలను వాడుకున్నారు'

తిరుపతి(భవానీనగర్) : వైకాపా పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, వై.వి సుబ్బారెడ్డిలు శ్రీవారి లడ్డూ, అన్న ప్రసాదాలను కమీషన్ల కోసం కల్తీ చేసి దళారి వ్యవస్థగా మార్చేశారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. హిందువుల గురించి మాట్లాడే నైతిక హక్కు భూమన కరుణాకరరెడ్డికి లేదన్నారు. కూటమి పాలనలో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనాలను కల్పిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో దోచుకున్న సొమ్మంతా తిరిగి శ్రీవారి హుండీకి చేరేలా చర్యలు చేపడతామన్నారు. మధు, రమేష్, నంద, గౌతమ్, ఖాజ, రామచంద్ర పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సిట్‌ను స్వాగతిస్తున్నాం : భూమన

తిరుపతి(జీవకోన): తితిదే అన్నప్రసాదాల తయారీలో సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి సుప్రీంకోర్టు స్వతంత్ర సిట్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సిట్‌ను స్వాగతిస్తున్నామని ఎంపీ గురుమూర్తి మరో ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో ప్రశాంతంగా టెట్ పరీక్షలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు(టెట్) రెండో రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఉదయం జరిగిన టెట్ పరీక్షకు మొత్తం 421 మందికిగాను 374 మంది హాజరు కాగా, 47 మంది గైర్హాజయ్యారు. మధ్యాహ్నం 491 మందికి అందరూ హాజరయ్యారు.

నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలి

తిరుపతి(రెవెన్యూ): ఉచిత ఇసుక పథకాన్ని తక్షణమే అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కే.వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్న, నరేంద్ర, శ్రీనివాసులు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి •సత్యవేడు

'సనాతన ధర్మంపై పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు అక్షర సత్యం'



మాట్లాడుతున్న కొండూరు అశోకరాజు

నారాయణవనం: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో నెలకొన్న వివాదం నేపథ్యంలో సనాతన ధర్మంపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యమని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల ఛైర్మన్ కొండూరు అశోక రాజు పేర్కొన్నారు. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సనాతన ధర్మంపై ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టి, తిరుపతిలో వారాహి సభ ద్వారా సనాతన ధర్మం గురించి చక్కగా చెప్పారన్నారు. ఆయనపై విమర్శలు చేయడం తగదన్నారు.

సమస్యలపై ఆరా



స్కిట్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థినులు, అధ్యాపకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: నర్సింగ్ స్కూలుకు సంబంధించి సమస్యలపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆరా తీశారు. స్కిట్ కళాశాల సందర్శన పూర్తయి తిరిగి వెళ్లే సమయంలో నర్సింగ్ విద్యార్థినులు, అధ్యాపకులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిశారు. పక్కా తరగతి గదులు, వసతి భవనాలు తదితర విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్కిట్ విలీన కమిటీతో సమావేశం పూర్తయ్యాక అక్కడి బోధన, బోధనేతర సిబ్బందితో మాట్లాడారు. వాళ్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నూతన భవనం ప్రారంభం

ఏర్పేడు: మండలంలోని దేవిడ్‌రేస్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నూతన భవనాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆసుపత్రి ప్రారంభం నుంచి బొజ్జల కుటుంబ సభ్యులు ఆసుపత్రి అభివృద్ధికి సహకారం అందిస్తుండటంతో నూతన భవనానికి బొజ్జల భవనంగా నామకరణం చేసినట్లు ఆ సంస్థ జనరల్ కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. శంకర్‌ప్రసాద్‌రెడ్డి, ఎంరీస్, స్వాతి, ప్రతాప్‌నాయుడు పాల్గొన్నారు.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు రజక కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి రజక కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని ఈనాడు ఆఫీసు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (5 అక్టోబర్ 2024, శనివారం), రేపు (6 అక్టోబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు** ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91547 72006 & 80080 02165** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.



▸ శ్రీకాళహస్తి: వక్కపొడి ప్యాకెట్లతో ముత్యాలమ్మకు విశేష అలంకరణలు ▸ బ్రహ్మచారిణిగా బొమ్మలకొలువు అమ్మవారు ▸ నారాయణవనం: స్వర్ణకవచ అలంకరణలో కామాక్షమ్మ ▸ ఏర్పేడు: గుడిమల్లంలో.. ప్రత్యేక అలంకరణలో శ్రీఆనందవల్లీదేవి

లోకపావని.. శక్తిస్వరూపిణి

శ్రీకాళహస్తి: దేవీ నవరాత్రి వార్షిక ఉత్సవాల సందర్భంగా శక్తి ఆలయాల్లో అమ్మవారు విశేష రూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. ముత్యాలమ్మ, చాముండేశ్వరి, పొన్నాలమ్మ, ఓంశక్తి, శీతలాంబ, నల్లగంగమ్మ, పెద్దగంగమ్మ ఆలయాలతో పాటు ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. **నారాయణవనంలో..** నాథేశ్వరస్వామి **బా** **ఏర్పేడులో..** గుడిమల్లంలో వెలసిన శ్రీఆనందవల్లీదేవి, **సత్యవేడులో..** వీరభద్రస్వామి, **వరదయ్యపాళెంలో** శ్రీకామాక్షి దేవీ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



▸ ఏర్పేడు: చిందేపల్లిలో బాలాత్రిపుర సుందరీదేవిగా ▸ సత్యవేడు: అరటిపళ్ల అలంకరణలో ▸ వరదయ్యపాళెం: అంబూరులో గాయత్రిదేవి అవతారంలో అమ్మవారు ▸ వరదయ్యపాళెంలో ధనలక్ష్మిగా..

ఇదేమి గ్రామసభ...?

రేణిగుంట, న్యూస్‌టుడే: గ్రామస్థులు లేకుండా గ్రామ సభ నిర్వహించడం ఏమిటి అని పలు పార్టీల నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ నేడు నిర్వహించే గ్రామ సభలో అసలు ప్రజలే లేరని, కేవలం సచివాలయ సిబ్బంది మాత్రమే పాల్గొనడం దారుణమని తెలిపారు. కార్యదర్శి బాలసుబ్రమణ్యంరెడ్డి, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి.. బీఎన్‌కండ్రిగ: ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యాదర్శి దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రమణయ్య, ధనంజయులు, బాలగురవయ్య, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేలంలో ఆదాయం .. నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ పల్లికొండేశ్వరస్వామి దేవస్థానంలో దుకాణాల నిర్వహణకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.2,20,000ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లత తెలిపారు.

తపాలా వారోత్సవాలను సద్వినియోగం చేసుకోండి.. తొట్టంబేడు: జాతీయ తపాలా వారోత్సవాలను ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆ శాఖ శ్రీకాళహస్తి సబ్ డివిజన్ అధికారి బాలాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 10న ఆధార్ సేవల ప్రత్యేక క్యాంపును శ్రీసిటీ తపాలా కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు.

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు.. రేణిగుంట: రేణిగుంట రైల్వే కల్యాణ మండపంలో సిబ్బందికి నిర్వహించిన క్యాంపునకు స్పందన లభించింది. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక రైల్వే వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ చెంచురెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు.

న్యాయం చేయాలని వినతి.. శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు): రహదారి ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని ఏర్పేడు మండలంలోని చిందేపల్లి ప్రజలు ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్థులంతా కలసి కట్టుగా శుక్రవారం పరిశ్రమ వద్దకు చేరుకుని రోడ్డుకు అడ్డంగా గేటు ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని తెలిపారు.

గౌడ కులస్థులకు ధ్రువీకరణలు.. శ్రీకాళహస్తి: కుల ధ్రువీకరణ పత్రాల విషయమై ఎవ్వరూ ఇబ్బందులకు గురికావాల్సిన పనిలేదని నియోజకవర్గ గౌడ కులసంఘం అధ్యక్షులు రమేష్‌బాబు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఆయన తెదేపా నేతలు, గౌడ సంఘం సభ్యులతో కలసి శుక్రవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణను సత్కరించి వినతి పత్రాన్ని అందజేశారు.

కలుపు మందుల వినియోగాన్ని నియంత్రించాలి.. బీఎన్‌కండ్రిగ: రైతులు పంటల్లో కలుపు మందుల వినియోగాన్ని నియంత్రించాలని జిల్లా వ్యవసాయశాఖ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. శుక్రవారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా వెస్ట్‌వరత్తూరు గ్రామంలో నిర్వహించిన రైతుశిక్షణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కన్నయ్యనాయుడు, రాస్ కేవీకే శాస్త్రవేత్త సుధాకర్, ఏవోలు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి..సత్యవేడు: మండలంలోని అల్లప్పగుంట గ్రామానికి సత్యవేడు నుంచి నాగలాపురానికి బస్సు సౌకర్యం కల్పించాలని శుక్రవారం నాగలాపురం, సత్యవేడు వయా జడేరి ప్రధాన రోడ్డుపై స్థానికులు ధర్నా చేపట్టారు. ఆరు నెలల ముందు తమ ఊరికి సత్యవేడు నుంచి నాగలాపురానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక పోవడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంపీడీవోగా బాలాజీనాయక్

నాగలాపురం: నాగలాపురం ఎంపీడీవోగా బాలాజీనాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న పీఎంకే బాబును కడప జిల్లాకు బదిలీ చేయగా, చంద్రగిరి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న బాలాజీనాయక్‌ను నాగలాపురం ఎంపీడీవోగా నియమించారు.

డీటీగా లావణ్య

నాగలాపురం: మండల డీటీగా లావణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న లావణ్యను సాధారన బదిలీల్లో భాగంగా నాగలాపురం డీటీగా నియమించారు.

డిప్యూటీ తహసీల్దారుగా వెంకటసుబ్బయ్య

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండల నూతన డిప్యూటీ తహసీల్దారుగా వెంకటసుబ్బయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఇక్కడ ఆర్‌ఐగా పని చేశారు. ఇక్కడ డీటీగా విధులు నిర్వరిస్తున్న శాంతి కలెక్టరేట్ కార్యాలయానికి బదిలీ కాగా కేవీబీపురం మండల రీసర్వే డీటీగా పని చేస్తున్న వెంకటసుబ్బయ్య బదిలీపై ఇక్కడ నియమితులైయ్యారు.

ధరలకు అక్రమ రెక్కలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎక్కడా లేని విధంగా ఇక్కడి నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాల కారణంగా ధరలకు రెక్కలొచ్చాయంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య ధ్వజమెత్తారు. అక్రమ తరలింపునకు నిరసనగా శుక్రవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పేరుకే ఇసుక ఉచితమని చెప్తున్నారని, అయితే అక్రమార్కుల చేతుల్లో అది వ్యాపారంగా మారిందన్నారు. అక్రమ తవ్వకాలు, తరలింపును కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నాగరాజు, మణి, కుమార్, సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, అన్వర్ పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

రేణిగుంట డీఎస్పీగా శ్రీనివాసరావు



రేణిగుంట: రేణిగుంట డీఎస్పీగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. గుంటూరు సీఐడీ విభాగంలో పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ గతంలో పని చేస్తున్న వెంకటాద్రి పదోన్నతిపై వెళ్లడంతో దాదాపు ఒకటిన్నర నెలగా ఈ స్థానం ఖాళీగానే ఉంది. అప్పటి నుంచి శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు.

ముక్కంటి సేవలో ప్రత్యేక కమిటీ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో స్కిట్ విలీన అంశంపై అధ్యయనానికి ప్రభుత్వం నియమించిన కమిటీ శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ డాక్టర్ రామ్మోహన్‌రావు, కార్యదర్శి నజీర్‌అహ్మద్, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్యతో పాటు పలువురు జేఎన్‌టీయూ ప్రతినిధులకు శుక్రవారం ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

రేణిగుంట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించేందుకు ఆయన శుక్రవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి బాజ్‌పాయి, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి...

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం ఆమె ఇక్కడికి చేరుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేషన్ బియ్యం స్వాధీనం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మండలంలోని శివనాథపురంలో బియ్యం లోడు మినీ వ్యాన్‌ను పోలీసులు, రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కేవీబీపురం మండలం సూరమాలకు చెందిన ప్రభాకర్ ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సుమారు 850 కేజీల బియ్యం లోడుతో సిద్ధంగా ఉంచిన మినీ వ్యాన్‌ను పట్టుకున్నారు. వివరాలను నమోదు చేసి వాహనాన్ని తొట్టంబేడు పోలీసు స్టేషన్‌కి తరలించారు.

ఆవుల అపహరణ

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని మడిబాక పంచాయతీలో వరుసగా ఆవులు అపహరణకు గురవుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల వ్యవధిలో రైతులకు చెందిన ఆరు ఆవులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారని తెలిపారు. తొండమాన్‌పురంలో శుక్రవారం ఓ ఇంట్లో గుర్తించి స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

బాధ్యతల స్వీకరణ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్లగా తిరుపతికి చెందిన ఊకా విజయకుమార్, సత్యవేడుకు చెందిన చందన స్రవంతి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం అమరావతిలో ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ గోవింద్ సత్యనారాయణతో పాటు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఊకా విజయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.



బాధ్యతలు చేపట్టిన గోవింద్ సత్యనారాయణ, ఊకా విజయకుమార్, చందన స్రవంతి

ఇరువర్గాల వివాదంపై కేసు

వరదయ్యపాళెం: రాజకీయ వివాదాలకు కేంద్రబిందువైన ఇందిరానగర్ పంచాయతీలో జరిగిన గ్రామసభలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జున్ తెలిపారు. ఇందిరానగర్ పంచాయతీలో గురువారం గ్రామసభ జరుగుతుండగా కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధి ఆశా మాట్లాడుతూ సహచట్టం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చిన నిధుల దుర్వినియోగంపై ఏం చర్యలు తీసుకున్నారంటూ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. దీనిపై సర్పంచి వీరభద్రం స్పందిస్తూ నిధుల దుర్వినియోగంపై విచారణ జరుగుతున్నందున గ్రామసభలో ప్రస్తావించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్పంచి అసభ్యంగా మాట్లాడాడని ఆశా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఆశా, ఆమె భర్త పై సర్పంచి ఇచ్చిన ఫిర్యాదుపై కోర్టు అనుమతి కోసం పంపినట్లు ఎస్సై తెలిపారు.

గూడూరు
• గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 85 వరకు
రెండో రకం: కిలో రూ. 45 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	127
లేయర్	110
బ్రాయిలర్ మాంసం	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	254
లేయర్ మాంసం	187

10న మండల సభ.. బాలాయపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వినీల్‌కుమార్ తెలిపారు. తాగునీరు, వైద్యం, గృహనిర్మాణాలు, ఉపాధి హామీ పథకం, జలవనరులు, రెవెన్యూశాఖ, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖలపై సమీక్షిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



హేమంత్‌కుమార్

వెంకటగిరి, న్యూస్‌టుడే: నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో ఏపీ ఆదర్శ పాఠశాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆదర్శ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-14 విభాగంలో హేమంత్ కుమార్ లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తులసీజ్యోతి తెలిపారు. అండర్-17 విభాగంలో 100 మీటర్ల పరుగుపందెంలో మునిలాస్య, చదరంగం పోటీల్లో సాత్విక్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటారన్నారు. అండర్-14 చదరంగం విభాగంలో దమేరేష్ సత్తా చాటారన్నారు. ఈ మేరకు వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

సీఎం దృష్టికి ఓజిలి సమస్యలు



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, ఓజిలి నాయకులు

ఓజిలి(నాయుడుపేట): మండలంలోని ప్రధాన సమస్యలను గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి ఓజిలి మండల తెదేపా అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మండల మైనార్టీ అధ్యక్షులు ఖలీల్.. సీఎం చంద్రబాబుకు వివరించారు. మండలంలోని రోడ్లు, చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వపల్లెలో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని, నిరుపేదల వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు విజయకుమార్ తెలిపారు. గున్న ట్రస్ట్ అధినేత గున్న మధుసూదన్‌రెడ్డి కూడా సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన తెదేపా నేతలు



లోకేశ్‌తో విజయశ్రీ, నెలవల, మాధవనాయుడు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గురువారం అమరావతిలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, వాకిచర్ల రమేష్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నాయుడుపేట, న్యూస్‌టుడే: పురదేవత శ్రీపోలేరమ్మ అమ్మవారి శరన్నవరాత్రుల వేడుకలకు ఈవో రవికుమార్, ఆలయ ధర్మకర్తల కుదేరు మణి, అర్చకులు శ్రీనివాసులురెడ్డిలు.. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు.

శాప్ ఛైర్మన్‌కు సత్కారం

నాయుడుపేట, న్యూస్‌టుడే: విజయవాడ ఇందిరాగాంధీ క్రీడా మైదానంలో శుక్రవారం ఏపీ శాప్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవినాయుడును నాయుడుపేటకు చెందిన తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి దార్ల రాజేంద్ర, తెలుగు యువత నాయకులు మామిడి అయ్యప్ప, ముసునూరు భాస్కర్‌రెడ్డి కలిశారు. సత్కరించి, ఆయనకు అభినందనలు తెలిపారు.

ఇసుక మాఫియాకు అడ్డేది!

☛ అందరూ ఒక్కటై.. ముఠాలుగా దోపిడీ ☛ రేయింబవళ్లు అక్రమ రవాణా

గూడూరు, గూడూరు పట్టణం, వాకాడు, న్యూస్‌టుడే: ఇసుక మాఫియా కొత్త అవతారం ఎత్తింది. నోరు తెరిచే వారితో చేతులు కలిపింది. రండి.. బంధు కొనండి.. జత అవ్వండంటూ దందా నడిపిస్తోంది. వైకాపా పాలో కీలకంగా ఇసుక స్మగ్లింగ్‌లో ఆరితేరిన నేతలు ఇదంతా చేస్తున్నారు. ఇలా అయిన వారితో బేరాలు పెట్టి.. కాని వారిపై కేసులు పెట్టిస్తున్నారు. అక్రమ రవాణాకు అందరినీ పాత్రధారులుగా మార్చి నదులు దోచేస్తున్నారు. గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లో అధికారిక రీచ్‌లు లేవు. ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేస్తున్నారు. రెండు ప్రధాన పార్టీల నేతలు ఒక్కటయ్యారు. మీకింత మాకింత అన్నట్లు ఇసుక రేవుల్లో దోపిడీ చేస్తున్నారు. పాపం పంచుకోవడానికి అంతా సిద్ధమై బరి తెగిస్తున్నారు. ఈ క్రమంలో స్వర్ణముఖి, కాళంగి నదులను దోపిడీ చేస్తున్నారు. రాత్రుల్లో కొందరు.. పగలు మరి కొందరుగా తవ్వి తరలిస్తున్నారు. మరి కొందరు నిల్వలు చేసి సొమ్ము చేసుకోవడం గమనార్హం.



వాకాడు వద్ద వెళ్తున్న ట్రాక్టర్



గూడలి వద్ద రేవు ఏర్పాటు

రోజూ 20 ట్రాక్టర్లు

పెళ్లకూరు మండలంలో కలవకూరు, పుల్లూరు, చింతపూడి, పెళ్లకూరు, చావలి తదితర ప్రాంతాల్లో ఇసుక తవ్వేస్తున్నారు. కలవకూరు నుంచి రోజూ 20 ట్రాక్టర్లు, వందల కొద్దీ ట్రక్కుల ఇసుక బయటకు వెళ్తోంది. తాజాగా ఇక్కడ వాహనాలను వెంకటగిరిలో ఆటో వారు పట్టుబడ్డారు. వీటిని గనుల శాఖకు అప్పగించారు. చావలి, పెళ్లకూరు ప్రాంతాల్లో కొందరు ట్రక్కుల కొని తవ్వకాలకు పంపడం గమనార్హం. ఆయా ప్రాంతాల్లో పార్టీల్లేకుండా అంతా ఒక్కటైనట్లు సమాచారం. కలవకూరు నుంచి వెళ్లే ఇసుక అటు బాలాయపల్లి, ఇటు పునబాక, శిరసనంబేడు ప్రాంతాల్లో నిల్వ చేసి లారీల్లో తరలిస్తున్నారు.

నిషేధం అయినా..

ఇసుక నిల్వలు పరిమితికి మించి ఉంచరాదు. తిరిగి విక్రయించరాదు. నిర్మాణాలకు తప్ప ఇతర అవసరాలకు వాడరాదు. ఇతర రాష్ట్రాలకు సరఫరా చేయరాదు. ఇలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు. భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంది. ఇవన్నీ పెద్దగా అమలు కాకపోవడంతో ఇసుకాసురులు చెలరేగుతున్నారు. నాయుడుపేట, అత్తివరం సెజ్‌లో పలు చోట్ల డంపింగ్ యార్డుల్లా ఇసుక ఉంది. వీటికి ఎలాంటి అనుమతి లేకున్నా దాడులు చేసే పరిస్థితి కొరవడింది. గూడూరు గ్రామీణం తిప్పవరప్పాడు వద్ద కైవల్యానది, విందూరు యేటి కాలువ, గొల్లపల్లి పెట్రోల్ బంకు సమీపంలోని నది నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఇదే తీరుగా వాకాడు, కోట మండలాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా ఉంది. అనుమతి ఉన్నట్లు ఇసుక రవాణా చేస్తున్నా అడ్డుకునే వారు లేకపోవడం గమనార్హం.

విజిలెన్స్ కళ్లకు గంతలు..

ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టడానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. ఇవన్నీ ప్రస్తుతం కళ్లకు గంతలు కట్టుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందులో రెవెన్యూ, గనుల, పోలీస్, జలవనరులశాఖ, పంచాయతీ రాజ్ శాఖలు భాగస్వామ్యం కాగా వారి జాడ లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయన్న చర్చ సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇసుకాసురుల దెబ్బతో ఇప్పటికే కాళంగి నది కళావిహీనంగా మారింది. అటు సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లో సముద్రపు జలాలు ఉప్పొంగి వస్తున్న దుస్థితి కాగా ఇటు దొరవారిసత్రం మండలంలో విచ్చలవిడిగా ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇక్కడ రాత్రి వేళల్లో ఇసుక తవ్వేస్తున్నారు. తనియాలి, వెదురుపట్టు తదితర ప్రాంతాల్లో ఇసుక విచ్చలవిడిగా సాగుతోంది. ఇలుపూరు తదితర ప్రాంతాల్లో ఇసుక రవాణాకు అడ్డులేకుండా ఉంది.

ఎక్కడా అనుమతి లేదు

ఇసుకకు అధికారికంగా ఎక్కడా రీచ్‌లు లేవు. ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అక్రమ రవాణా చేయడానికి వీల్లేదు. ఇలాంటి వారిపై నిఘా పెట్టాం. ఇసుక నిల్వలపై దాడులు చేయిస్తాం.

- శ్రీనివాస్, ఏడీ గనుల శాఖ, గూడూరు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులుపైనే అవుతున్నా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయకపోవడం దారుణమని సీపీఎం నాయకుడు జోగి శివకుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే ప్రభుత్వం ఇసుక అందుబాటులోకి తీసుకొని రావాలని డిమాండ్ చేశారు. నాయకులు రమణయ్య, సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. **వెంకటగిరి:** ఇసుక సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు రాంబాబుకు వినతిప్రతం అందించారు. ఇసుక లభ్యం కాకపోవడంతో కార్మికులు పనులు లేక ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. నేతలు భాస్కర్, రమణయ్య, శ్రీనివాసులు, సుబ్బమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపాతోనే చేనేతల అభ్యున్నతి

వెంకటగిరి, న్యూస్‌టుడే: చేనేతల అభ్యున్నతి తెదేపాతోనే సాధ్యమవుతుందని పద్మశాలి సంఘం రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ అన్నారు. శుక్రవారం జాతీయ దేవాంగ సంఘం నేతలు గంగాధర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. నేతలు శ్రీనివాసులు, త్యాగరాజు, గిరిప్రసాద్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరి: రాజరాజేశ్వరి దేవిగా మందనాంచారేశ్వరి దేవి • గూడలిలో గాయత్రీదేవిగా రామలింగచాముండేశ్వరిదేవి • ఆదిలక్ష్మిగా కలవకొండ లక్ష్మీదేవి • చిల్లకూరు: పసుపుకొమ్ముల అలంకరణలో ముత్యాలమ్మ • వాకాడులో గాయత్రీదేవిగా నాగవరప్పమ్మ • బాలత్రిపుర సుందరిదేవిగా మూకాంబికాదేవి • సూళ్లూరుపేట: మహాలక్ష్మిగా కన్యకా పరమేశ్వరి

ప్రత్యేకాలంకరణలో అమ్మవార్లు



గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో గాన ప్రదర్శనలో కళాకారులు

దసరా మహోత్సవాల్లో భాగంగా గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవార్లు విశేషాలంకరణలో, వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. ఉత్సవమూర్తులకు గ్రామోత్సవాలు నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

-న్యూస్‌టుడే బృందం

డాక్టరేట్ ప్రదానం



అధ్యాపకుడిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కోట, న్యూస్‌టుడే: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేసే కొల్లూరు సందీప్‌కుమార్‌కు అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్ర సాంకేతిక విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల డైరెక్టర్ విజమకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే ఆయనను శుక్రవారం కళాశాలలో అభినందించారు. విభాగాధిపతులు శ్రీనివాస్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని కలిసి వైకాపా నేతలు



కాకాణినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, వైకాపా నాయకులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షుడిగా ఎంపికైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని శుక్రవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, వైకాపా నాయకులు నెల్లూరులో కలిసి సన్మానించారు.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు రజక కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి రజక కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని ఈనాడు ఆఫీసు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (5 అక్టోబర్ 2024, శనివారం), రేపు (6 అక్టోబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91547 72006 & 80080 02165** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.



పూడిరాయదొరువులో నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

తీర ప్రాంత సమస్యలపై సమీక్షిస్తాం

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని సముద్ర తీర గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై ఆయా శాఖల అధికారులతో త్వరలో ఓ సమీక్ష ఏర్పాటు చేసి చర్చిస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం పూడిరాయదొరువు గ్రామంలో ఆయన పర్యటించారు. అక్కడి నేతలు రాజగోపాల్‌రెడ్డి, అయ్యల్‌రెడ్డిల నివాసానికి వెళ్లి వారితో చర్చించారు. సమస్యలపై అక్కడి ప్రజలతో మాట్లాడారు. తెదేపా నేతలు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, దువ్వూరు మధురెడ్డి, భాజపా నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, జిల్లా అధికార యువత ప్రతినిధి కుంచం దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పింక్ బస్సు సేవలు సద్వినియోగం చేసుకోండి

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మీజూరులో శుక్రవారం పింక్ బస్సు సేవలను ప్రారంభించారు. గ్రామాల్లో 40 ఏళ్లు నిండిన మహిళలు, పొగాకు ఉత్పత్తులను సేవించే పురుషులందరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే సరైన వైద్య సేవలు పొంది నయం చేసుకోవచ్చని తెలిపారు. వైద్యాధికారి తరుణ్‌సాయికుమార్, చైతన్యభాను, సర్పంచి రమణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ జనార్దనయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మీజూరులో సేవలు ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

బాధ్యతల స్వీకరణ



నరేంద్రకుమార్

వెంకటగిరి, న్యూస్‌టుడే: పురపాలక కమిషనర్‌గా నరేంద్రకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా జంగారెడ్డిగూడెం నుంచి వెంకటగిరికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ రషీద్ చీరాలకు బదిలీ అయ్యారు. కమిషనర్ తొలుత వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు చేపట్టారు.

నాయుడుపేట, న్యూస్‌టుడే:

సమస్య: కొనేటిరాజుపాళెం అరుంధతీయవాడ ఏదురుగా రహదారి పక్కనే ఎక్కడబడితే అక్కడ చెత్తను నింపడంతో దుర్గంధభరితంగా మారింది. **-స్థానికులు**

సమాధానం: చెత్తను నిల్వ చేసే ప్రాంతాలు పరిశీలించి. వ్యర్థాలు సంపద కేంద్రానికి తరలిస్తాం. **-గోపాల్, పంచాయతీ కార్యదర్శి**

కోట, న్యూస్‌టుడే:

సమస్య: కోట మండలం గూడలి అరుంధతీయవాడ సమీపంలోని పంటకాలువ పిచ్చి చెట్లతో నిండి పూడిపోయి ఉనికి కోల్పోయింది. దీంతో పారుదల లేకుండా పోయింది. **- నారాయణ, స్థానికుడు**

సమాధానం: పూడిక తీయిస్తాం. **- మునిరత్నం, ఏఈ**

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: రెండో పట్టణంలోని గూడూరు-వెంకటగిరి ప్రధాన రహదారిపై చెత్తాచెదారాలు ఉండడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. **-నారాయణ, గూడూరు**

సమాధానం: తొలగిస్తాం. **-వెంకటేశ్వర్లు, కమిషనర్**

కొండచిలువ కలకలం

గూడూరు పట్టణం: రెండో పట్టణం గూడూరు- వెంకటగిరి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి కొండచిలువ రోడ్డుపైకి అడ్డంగా రావడంతో వాహనాలు, పాదచారులు భయాందోళన చెందారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

పెళ్లకూరు ఎంపీడీవోగా ప్రమీలరాణి



ఎంపీడీవోను అభినందిస్తున్న ఉద్యోగులు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: ఎంపీడీవోగా ప్రమీలరాణి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. సూళ్లూరుపేట నుంచి బదిలీపై వచ్చిన ఆమెకు ఏవో అన్నపూర్ణరావు, పంచాయతీ కార్యదర్శులు మధు తదితరులు అభినందించారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఎంపీడీవో తెలిపారు.

త్రుటిలో తప్పిన పిడుగు ప్రమాదం

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి పండ్లూరు గ్రామం సమీపంలో చెరువు వద్ద కొందరికి త్రుటిలో ప్రమాదం తప్పింది. గ్రామానికి సమీపంలోని పెద్ద చెరువు కట్టపై ఉన్న తాడిచెట్టుపై ఉరుములు మెరుపులతో పడిన పిడుగుపాటుకు సమీపంలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా బిత్తరపోయి పరుగులు తీశారు. ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పిడుగు చెట్టు మధ్యలో పడడంతో తాటి మాను కాలిపోయింది.

వివాహిత బలవన్మరణం

చిల్లకూరు, న్యూస్‌టుడే: ఓడూరు గిరిజన కాలనీకి చెందిన వివాహిత తేజస్విని(22) గురువారం రాత్రి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం కేసు నమోదు చేశామని వివరించారు.

స్థానికులే బాగు చేసుకున్న నీటి పథకం

పెళ్లకూరు, న్యూస్‌టుడే: చిల్లకూరు వడ్డిపాళెం తాగునీటి పథకాన్ని స్థానికులే బాగు చేసుకున్నారు. ఇక్కడ నీటి సరఫరాని స్థానిక వైకాపా నేత ఆపేయడంతో స్థానికులు సొంత నిధులు వెచ్చించి బాగు చేసుకున్నారు. స్వర్ణముఖి నుంచి వెళ్లే నీటి పథకం దెబ్బతింది. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయగా బాగు చేయడానికి వెళ్లిన వారిని ఆపేయడంతో స్థానికులు బాగు చేయించుకున్నారు.



గొట్టపు మార్గం బాగు చేస్తున్న స్థానికులు

ఆస్పత్రుల్లో సహాయకులకు నైపుణ్య శిక్షణ

ఈనాడు, అమరావతి: ఆస్పత్రుల్లో రోగుల పడకల వద్ద సహాయకులుగా పని చేసే వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శ్రీసత్యసాయి సేవా ట్రస్టుతో ఒప్పందం కుదుర్చుకుంది. తాడేపల్లిలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఈ ఒప్పందం జరిగింది. దీని ప్రకారం పదో తరగతి ఉత్తీర్ణులు, ఇంటర్మీడియట్, అండర్ గ్రాడ్యుయేట్ చదువు మధ్యలో నిలిపివేసిన వారు, నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఆన్ జాబ్ శిక్షణతో కలిపి మొత్తం ఐదు నెలలు ఈ కోర్సు ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ ట్రస్టీ జి.సాయి విశ్వనాథం, ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ దినేష్‌కుమార్, నర్సింగ్ నైపుణ్యాభివృద్ధి అధికారి రేహానాఖాన్ పాల్గొన్నారు.

‘ఆ జీవోను వెనక్కు తీసుకోవాలి’

ఈనాడు, అమరావతి: ఎసైన్డ్ భూముల్లో ఇసుక తవ్వుకోవడానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదలకిచ్చిన ఎసైన్డ్ భూముల్లో మైనింగ్ తవ్వరాదని, ఆక్వా సాగు చేయకూడదని.. పేదలు, వారి కుటుంబాలు తరతరాలుగా ఆ భూమిని అనుభవించాలని చట్టం చెబుతోందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం దళితులు, పేదలకు వ్యతిరేకమని, ఇప్పటికే లక్షల ఎకరాల పేదల భూములను పెత్తందారు దౌర్జన్యంగా, అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు.

పన్నెండోసారి బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు జగన్ శుక్రవారం మరోసారి బెంగళూరుకు వెళ్లారు. గత నెల 28న బెంగళూరుకు వెళ్లిన ఆయన మంగళవారం తిరిగొచ్చారు. మూడు రోజులకే మళ్లీ అక్కడికే పయనమయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక జగన్ బెంగళూరుకు వెళ్లడం ఇది 12వ సారికావడం గమనార్హం.



ఫలితాలను తీసుకొచ్చేది పని మాత్రమే

మీరు బలంగా కోరుకున్నంత మాత్రాన ఏదీ మీకు దక్కదు. విద్య, సామర్థ్యాల్లాంటి అర్హతలు ఉన్నంత మాత్రాన ఏవీ వచ్చి మీ ఒళ్లో వాలవు. అమోఘమైన తెలివితేటలు మీకున్నా అన్నీ మీ దరి చేరవు. మీరు వేటి కోసమైతే నిజంగా కష్టపడి పనిచేస్తారో అవి మాత్రమే మిమ్మల్ని వరిస్తాయి. ఫలితాలను తీసుకొచ్చేది ఆశలు, ఆకాంక్షలు కాదు.. అంకితభావంతో స్థిరంగా పనిచేసే గుణమే.

– కోరీ విల్సన్, బిజినెస్ కన్సల్టెంట్

ఉన్నత విద్యలో ఆన్‌లైన్ పరీక్షల విధానం

- విశ్వవిద్యాలయాల్లో ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రాల రూపకల్పన
- కంప్యూటర్‌లో జవాబుపత్రాల మూల్యాంకనం
- మార్కులు ట్యాంపరింగ్ చేయకుండా పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో పరీక్షల విధానాన్ని కంప్యూటరీకరణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిగ్రీ, పీజీ పరీక్షల ఫలితాల్లో పారదర్శకత, మార్కుల్లో కచ్చితత్వం, పరీక్షల నిర్వహణను పటిష్ఠం చేసేందుకు ఈ విధానాన్ని తీసుకొస్తోంది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ‘సమగ్ర పరీక్షల నిర్వహణ విధానం’ అమలు చేయనుంది. గతంలో కాగ్ సైతం ప్రశ్నపత్రాల మూల్యాంకనంలో లోపాలు ఉన్నట్లు బహిర్గతం చేసింది. మొదట పరీక్షల్లో తప్పినా, పునర్ మూల్యాంకనంతో ఉత్తీర్ణులవుతున్న వారి సంఖ్య కొన్ని వర్సిటీల్లో 40% వరకు ఉంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో గతంలో బీఈడీలో 52 మంది పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేస్తే వీరిలో 30 మంది మార్కులు మారాయి. పీజీలో ఒక కోర్సుకు 80 మంది దరఖాస్తు చేస్తే 52 మందికి మార్కులు పెరిగాయి. ఆంధ్ర, ఆదికవి నన్నయ, ఎస్వీ యూనివర్సిటీల్లో పునర్ మూల్యాంకనం బాగోలేదని గతంలో కాగ్ హెచ్చరించింది. విశ్వవిద్యాలయాల్లో పరీక్షల నిర్వహణ విభాగానికి, ఇతర విభాగాలకు మధ్య సమన్వయం లేదు. గతంలో నాగార్జున వర్సిటీలో కొన్ని బీఈడీ కళాశాలలకు ప్రవేశాలకు అనుమతులు లేకపోయినా పరీక్షల విభాగం పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ప్రకటించడం ఆరోపణలున్నాయి. వర్సిటీల్లో ఇలాంటి పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఆన్‌లైన్ మూల్యాంకనం..

కొత్తగా తెచ్చే సంస్కరణల్లో భాగంగా ప్రశ్నపత్రాల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ చేయనున్నారు. పరీక్షలు పూర్తయ్యాక జవాబుపత్రాలను స్కానింగ్ చేస్తారు. అభ్యర్థి పేరు లేకుండా వీటికి కోడ్ కేటాయిస్తారు. అనంతరం వీటికి పాస్‌వర్డ్ పెడతారు. వర్సిటీల్లో ఈ విభాగం చూసే అధికారులు జవాబుపత్రాలను మూల్యాంకనం కోసం ఆన్‌లైన్‌లో అధ్యాపకులకు పంపిస్తారు. వారు కంప్యూటర్‌లోనే మూల్యాంకనం చేసి, సబ్మిట్ చేయగానే సంబంధిత అధికారికి ఇది వస్తుంది.

★ మార్కులు రాగానే ఆటోమేటిగ్గా ఆయా వర్సిటీల లోగో, నమూనాతో మెమోల్లోకి ఈ మార్కులు వచ్చేస్తాయి. వీటిని డిజి లాకర్‌కు అనుసంధానిస్తారు. అభ్యర్థులు తమ మార్కుల మెమోలను డిజి లాకర్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

★ పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేసేవారికి అవసరమైతే వారు రాసిన జవాబుపత్రాలను అందించే అవకాశం ఉంటుంది. మూల్యాంకనం సైతం తొందరగా పూర్తవుతుంది. ఏటా అన్ని వర్సిటీల పరిధిలో 8 లక్షల మంది పరీక్షలు రాస్తున్నారు.

ప్రశ్నల బ్యాంకు ఏర్పాటు

ప్రశ్నపత్రాలనూ కంప్యూటర్ ద్వారానే రూపొందిస్తారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలబ్యాంకును ఏర్పాటు చేస్తారు. వాటిలో నుంచి ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రం రూపొందిస్తారు. ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్‌లో పంపించడంపై ఉన్నత విద్యామండలి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తోంది. గతంలో కొన్ని వర్సిటీలు ప్రశ్నపత్రాలను ముందే ముద్రించి పంపేవి. ప్రశ్నపత్రాలను ముద్రించడం, వాటిని సరఫరా చేయడం లాంటివి లేకుండా పరీక్షకు 15 నిమిషాల ముందు ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో పాస్‌వర్డ్‌తో పంపించి, వాటిని ప్రింట్లు తీసుకుని, అభ్యర్థులకు ఇచ్చే విధానంపై ఆలోచన చేస్తున్నారు.

★ వర్సిటీల్లో పరీక్షల విభాగం కంప్యూటరీకరణ ప్రక్రియ కోసం ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థను ఎంపిక చేసేందుకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా ఉన్నత విద్యాశాఖ టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్లు స్వీకరిస్తుంది. సంస్థను ఎంపిక చేశాక ఉన్నత విద్యాశాఖ వర్సిటీలకు కేటాయించనుంది.

కర్ణాటకలో లేని ప్రైవేటీకరణ విశాఖలో ఎందుకు?

- ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలి
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల. చిత్రంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి తన రాష్ట్రంలోని మూతపడిన ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించుకున్నారని, 23 మంది ఎంపీలు ఉన్నా.. ఎన్డీయే ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఎందుకు అడ్డుకోవడంలేదని వక్తలు ప్రశ్నించారు. పదేళ్లుగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా భాజపాకే మద్దతిచ్చాయని, ఒక్క విభజన హామీని అమలు చేయకున్నా ఊడిగం చేశాయని మండిపడ్డారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయిస్తే అదే లాభాల్లోకి వస్తుందని అన్నారు. ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లేఖ అందించాలని నిర్ణయించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ.. ‘ప్రస్తుతం భాజపా కేంద్రంలో అధికారంలో ఉండటానికి కారణం తెదేపా ఎంపీలే. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు ఎందుకు మాట్లాడటంలేదు. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి అంటున్నారు. కానీ అవి చేసేది భాజపానే. యూపీఏ అధికారంలో ఉన్నన్ని రోజులూ ఫ్యాక్టరీ లాభాల్లోనే ఉంది. భాజపా అధికారంలోకి వచ్చాకే అప్పుల పాలైంది’ అని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ‘ప్రైవేటీకరణ చేయాలనేది రాజకీయ నిర్ణయం. 10 ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నా.. ప్రైవేటీకరణే మా విధానమని నేరుగా చెబుతున్నారు. ప్రతిపక్ష నేతలుగా మాట్లాడే హక్కు మాకుంది. రాజకీయ పార్టీలు, నాయకులు, విద్యార్థులు, మేధావులు దీనిపై మాట్లాడాలి. భాజపా నాయకులు ప్రైవేటీకరణ చేస్తామని చెబుతుంటే తెదేపా, జనసేన పార్టీలు మాత్రం రోజుకో మాట మాట్లాడుతున్నాయి’ అని మండిపడ్డారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ‘విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయిస్తే ఏటా రూ.3వేల కోట్ల లాభాలు ఆర్జిస్తుంది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని మర్లపాడులో సుమారు 1,300 ఎకరాల్లోని గనులను జిందాల్ కంపెనీకి కేటాయించారు. వాటిని విశాఖ ఉక్కు పరిశ్రమకు కేటాయించాలి’ అని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ‘ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అందుకే ప్లాంట్‌కు రావాల్సిన గనులను తొలగిస్తోంది. ప్రైవేటీకరణ చేసి అదానీకి అప్పజెప్పాలని చూస్తోంది’ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సింగరావు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తునకు సహకరించండి

- వైకాపా నేత సజ్జలకు హైకోర్టు ఆదేశం
- ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ 25కు వాయిదా

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై మూకుమ్మడి దాడి కేసులో దర్యాప్తునకు సహకరించాలని వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయన అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో తనను నిందితుడిగా చేర్చారని, వాస్తవానికి ఆ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ సజ్జల రామకృష్ణారెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. సజ్జల రామకృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. తెదేపా కార్యాలయంపై దాడి ఘటన రోజున పిటిషనర్ పోరుమామిళ్లలో, ఘటనా స్థలానికి 600 కి.మీ దూరంలో ఉన్నారని కోర్టుకు నివేదించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

దాడి ఘటన రోజు సజ్జల రామకృష్ణారెడ్డి, తాడేపల్లి వైకాపా కార్యాలయంలో ఉన్నట్లు ఇద్దరు సహ నిందితులు, ఇద్దరు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారని తెలిపారు. దేవినేని అవినాష్ అనుచరుడు, ఈ కేసులో నిందితుడు షేక్ సైదా ఇచ్చిన వాంగ్మూలంలో ఆ రోజు సాయంత్రం 3 గంటలకు వైకాపా కార్యాలయంలో పిటిషనర్‌ను చూసినట్లు వెల్లడించారన్నారు. సజ్జల ప్రోద్బలంతోనే దాడి చేసినట్లు షేక్ సైదా చెప్పారని తెలిపారు. దాడి ఘటనలో సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభించాయని పేర్కొన్నారు.

నందిగం సురేష్‌కు షరతులతో బెయిలు

దర్యాప్తునకు అందుబాటులో ఉండాలన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్, వైకాపా సానుభూతిపరుడు అవుతు శ్రీనివాస రెడ్డిలకు హైకోర్టు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిలు మంజూరు చేసింది. మంగళగిరి మొదటి తరగతి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో రూ.15వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అభియోగ పత్రం దాఖలు చేసేవరకూ ప్రతి నెలా 1, 15వ తేదీల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఏదో ఒక సమయంలో దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని ఇద్దరినీ ఆదేశించింది. దర్యాప్తు నిమిత్తం పోలీసులు కావాలన్నప్పుడల్లా అందుబాటులో ఉండాలని పిటిషనర్లకు తేల్చిచెప్పింది. ఈ కేసులో ఎవరినీ ప్రలోభపెట్టడం, బెదిరించడం చేయవద్దని ఆదేశించింది. ఇలాంటి నేర ఘటనలను పునరావృతం చేయవద్దని స్పష్టం చేసింది. దిగువ కోర్టులో విచారణ ప్రక్రియలో పాల్గొనాలని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈ మేరకు తీర్పు చెప్పారు.

★ పోలీసులకు నందిగం సురేష్ మొబైల్ ఫోన్లను అప్పగించకపోవడాన్ని దర్యాప్తునకు సహకరించనట్లుగా చెప్పలేమని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. పిటిషనర్లను సెప్టెంబరు 4న అరెస్టు చేశారని, నెల రోజులుగా జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారని గుర్తుచేశారు. పోలీసు కస్టడీ పూర్తయిందన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిలు మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఏఆర్ డెయిరీ ఎండీ ముందస్తు బెయిలు పిటిషన్ 17కు వాయిదా

ఈనాడు, అమరావతి: ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఆర్.రాజశేఖరన్ హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ ఈ నెల 17కు వాయిదా పడింది. శ్రీవారి లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలతో తనపై తిరుపతి తూర్పు ఠాణాలో సెప్టెంబరు 25న నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరుచేయాలని రాజశేఖరన్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. శుక్రవారం నాటి విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. లడ్డూ విషయమై సుప్రీంకోర్టులో చోటుచేసుకున్న పరిణామం నేపథ్యంలో తమ పిటిషన్‌ను ఈ నెల 17కు వాయిదా వేయాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను వాయిదా వేశారు.

సీఎం సహాయనిధికి రూ.5.16 లక్షల విరాళం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న పీసీ రాయల్

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో తిరుపతికి చెందిన కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పీసీ రాయల్ రూ. 5.16 లక్షల విరాళాన్ని అందించారు. రూ. 3 లక్షలు విజయవాడ వరద బాధితుల నిమిత్తం, రూ. 2.16 లక్షలు అన్నా క్యాంటీన్ల నిర్వహణ కోసం వేర్వేరు చెక్కులు అందించినట్లు ఆయన తెలిపారు.

తిరుపతి (బైరాగిపట్టెడ) : తిరుపతి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి శుక్రవారం రూ.50 వేలను స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందించారు. జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, నరసింహులు నాయుడు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్, కార్యదర్శి నూర్జహాన్, వైస్ ప్రెసిడెంట్ ఉషారాణి, జాయింట్ సెక్రటరీ మణి, కోశాధికారి రామమూర్తి పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆర్సీ మునికృష్ణ, సుబ్బుయాదవ్

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నిర్మాత ఎస్వీ ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సన్నిహితులు శుక్రవారం నగరంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రసూతి ఆసుపత్రి ఎదుట జరిగిన కార్యక్రమంలో తెదేపా కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు సుబ్బు యాదవ్, హరిశంకర్, మధుబాబు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



అశేష జనవాహినికి అభయ హస్తం



బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి

వైభవంగా ధ్వజపటం ఊరేగింపు

తిరుమల, తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజపటం ఊరేగింపు శుక్రవారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా సాగింది.

● శ్రీవారి సేవకులు అంకిత భావం, క్రమశిక్షణతో సేవలను అందించాలని తితిదే ఈవో జె.శ్యామలరావు పిలుపునిచ్చారు. స్థానిక ఆస్థాన మండపంలో ఈవో మాట్లాడుతూ.. భక్తులకు సేవలందించేందుకు దాదాపు నాలుగువేల మంది శ్రీవారి సేవకులను తితిదే ఆహ్వానించిందని తెలిపారు. అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ప్రసంగిస్తూ దేశవ్యాప్తంగా వచ్చిన వాలంటీర్లు భక్తులకు నిస్వార్థంగా సేవలందించాలన్నారు. **అలరించిన తితిదే ధార్మిక కార్యక్రమాలు :** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజైన శుక్రవారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో తితిదే ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన సురభి వినాయక నాట్య మండలి ఆధ్వర్యంలో భక్త ప్రహ్లాద నాటకాన్ని ప్రదర్శించారు.

● తిరుపతి శ్రీ రామచంద్ర పుష్కరిణి వేదికగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు సాయంత్రం వేణుగానం, రాత్రికి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల పూర్వ విద్యార్థి శ్రీనివాస్ భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు.

● తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో సాయంత్రం ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు సురేష్‌బాబు బృందం గాత్ర సంగీతం, రాత్రికి డా.గౌతమి బృందం భరతనాట్యం ప్రదర్శించారు.

పెద్దశేష వాహనంపై కల్యాణ వేంకన్న విహారం



కల్యాణ వేంకన్న ఊరేగింపు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: తుమ్మలగుంటలోని కల్యాణ వేంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్సవమూర్తి పెద్దశేషవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. నిత్యపూజలు నిర్వహించిన తర్వాత ధ్వజస్తంభానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ధ్వజపటాన్ని ఎగురవేసి సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. రాత్రి స్వామివారిని వాహన మండపంలో పెద్ద శేష వాహనంపై కొలువుంచి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సుధారాణి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్య కసిరెడ్డి సుధారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య పద్మనాభరెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్న ఆమె మాట్లాడుతూ 70 సంవత్సరాల చరిత్ర కలిగిన కళాశాలకు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల మెరుగైన ఫలితాల సాధనకు నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.

నూతన డైరెక్టర్లుగా..



బాధ్యతలు చేపట్టిన గోవింద్ సత్యనారాయణ, ఊకా విజయకుమార్, చందన స్రవంతి

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్లుగా తిరుపతికి చెందిన ఊకా విజయకుమార్, సత్యవేడుకు చెందిన చందన స్రవంతి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం అమరావతిలో ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ గోవింద్ సత్యనారాయణతో పాటు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఊకా విజయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

ఎంపీడీవోగా రామచంద్ర



తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం ఎంపీడీవోగా రామచంద్ర బాధ్యతలు స్వీకరించారు. కేవీబీపురం మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా గ్రామీణ మండలం ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: చిన్నగొట్టిగల్లు ఎంపీడీవోగా గిడ్డయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏర్పేడు నుంచి బదిలీపై చిన్నగొట్టిగల్లుకు వచ్చారు. తెదేపా నాయకులు ఆయన్ను అభినందించి సన్మానించారు.

నూతన స్టాండింగ్ కౌన్సిల్‌గా దినకర్

తిరుపతి (లీగల్): తిరుపతి నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా సీనియర్ న్యాయవాది తమిదలపాటి దినకర్‌ని నియమిస్తూ తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయానికి సంబంధించిన అన్ని కేసులు తిరుపతి కోర్టులో వాదించాల్సి ఉంటుంది.

ఘాట్ రోడ్డు బస్సులకు పూజలు

తిరుపతి (ఆర్టీసీ): శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తిరుపతి-తిరుమల ఘాట్ రోడ్డు బస్సులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున ఆయా డిపోలు, తిరుపతిలోని ఏడుకొండలు బస్టాప్‌లోని బస్సులకు జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, సీఎంఈ నరసింహులు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

తమిళ భక్తుల ఆందోళన.. తిరుమల, న్యూస్‌టుడే: తితిదే వసతి గదులు ఇవ్వడం లేదని తమిళనాడు భక్తులు ఆందోళన చేపట్టిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. శ్రీవిల్లిపుత్తూరుకు చెందిన దాదాపు 50 మంది భక్తులు తిరుమలకు చేరుకున్నారు. వీరు ఇక్కడే కొన్నిరోజులపాటు ఉంటూ వంట చేసుకుని శ్రీవారి ప్రసాదంగా స్వీకరించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో వారు బస కోసం సీఆర్వో కేంద్రం వద్దకు వెళ్లగా గదులు లేకపోవడంతో స్థానిక లేపాక్షి కూడలి వద్ద రోడ్డుపై ఆందోళన చేపట్టారు. తితిదే భద్రతాధికారులు అక్కడికి చేరుకుని కొన్ని గదులు తీసిచ్చినట్లు సమాచారం.

డ్రంకన్ డ్రైవ్ కేసులో 14 మందికి జరిమానా

తిరుపతి (లీగల్): నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 14 మంది వాహన చోదకులకు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంథి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు కోర్టు పర్యవేక్షకులు సుబ్బారెడ్డి, కోర్టు పోలీసు గిరి సంయుక్తంగా తెలిపారు. డీఎస్పీ రామకృష్ణ ఆచారి పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 14మందిపై కేసులు నమోదుచేసి కోర్టుకి అప్పగించారు. రెండోసారి పట్టుబడిన వాహన చోదకుడు సతీష్‌నాయక్‌కు అయిదు రోజులు, అధిక మోతాదులో మద్యం తాగిన ముగ్గురికి జరిమానాతోపాటు మూడురోజుల జైలుశిక్ష విధించారు.